

# అధ్యక్షా..!

● 26న విద్యార్థులతో మాక్ అసెంబ్లీ

● జిల్లా నుంచి 7 మంది ఎంపిక

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'అధ్యక్షా... ముందుగా మాట్లాడేందుకు అవకాశం కల్పించిన స్పీకర్ గారికి, ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను. మీ ద్వారా విద్యాశాఖ మంత్రికి విన్నవించుకునేది ఏంటంటే మా నియోజకవర్గంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రణాళిక లేకుండా చేపట్టిన పాఠశాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పిల్లలు చదువుకునేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి నిర్మాణానికి నిధులు కేటాయించాలని తమ ద్వారా విద్యాశాఖ మంత్రిని కోరుతున్నాను. స్పీకర్ స్పందిస్తూ విద్యాశాఖమంత్రి గారూ సమాధానం చెప్పండి'

ఇలా మనం ఎన్నికల్లో ఓట్లేసి ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు... చట్టసభల్లో వ్యవహరించే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని 236 ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

### ఎంపిక ఇలా..

మాక్ అసెంబ్లీలో విద్యార్థుల ఎంపికకు 236 ఉన్నత పాఠశాలల నుంచి పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అక్టోబరు 30న వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆరుగురి చొప్పున మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నవంబరు 1న ఆరుగురి చొప్పున నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. ఈ దశలో విజేతలను రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రస్థాయి పోటీలకు 175 మందిని ఎంపిక చేస్తారు.

### ప్రశ్నలు..

రాజ్యాంగం నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇష్టమైన స్వాతంత్ర్య ఉద్యమకారుడు అంశంపై ఉపన్యాసం, స్థానిక పరిపాలన అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయి. వికసిత్ ఆంధ్రప్రదేశ్, పౌరహక్కులు, బాధ్యతలు, హక్కుల రూపకల్పనలో న్యాయవ్యవస్థ పాత్ర, స్వాతంత్ర్యోద్యమ నాయకులు, అసెంబ్లీ నిర్వహణ, స్పీకరు, డిప్యూటీ స్పీకరు, సీఎం, మంత్రుల బాధ్యతలు అంశాలపై పట్టు సాధించాలి. వీటిపై ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షలు నిర్వహించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని (నియోజకవర్గానికి ఒక్కరు) మాక్ అసెంబ్లీకి ఎంపిక చేశారు.

### అసెంబ్లీ ఎలా ఉంటుంది

అసెంబ్లీ నిర్వహణ తీరు, రాజ్యాంగ దినోత్సవం అంటే ఏమిటి, ఎలా నిర్వహిస్తారు తదితర విషయాలను విద్యార్థులు పుస్తకాల్లో చదువుకోవడం, సామాజిక మాధ్యమాల్లో చూసే తెలుసుకున్నారు. ప్రత్యక్షంగా చూడలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 26న అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీ, రాజ్యాంగ దినోత్సవంలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించనున్నారు.

### జిల్లా స్థాయి మాక్ అసెంబ్లీ

నియోజకవర్గ స్థాయికి సంబంధించి ఏడు నియోజకవర్గాల్లో ఎంపికైన 21 మందికి ఈ నెల 8న ప్రొద్దుటూరు జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఏడు మంది మాత్రమే రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీకి హాజరవుతారు. మిగతా 14 మందిని నిరాశపరచకుండా జిల్లా స్థాయిలో మాక్ అసెంబ్లీ నిర్వహించి విద్యార్థులకు అసెంబ్లీలో జరిగే విధానంపై అవగాహన కల్పించనున్నారు.

## విద్యతోనే పేదరికం దూరం

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టరు శ్రీధర్

కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అందరూ విద్యావంతులైతే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు పేదరికం కూడా దూరమవుతుందని కలెక్టరు డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ 138వ జయంతి వేడుక కార్యక్రమం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరుతో పాటు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు దావుద్‌బాక్షి, బైపారి జాకీర్ హుసేన్, ఫాస్టర్ శామ్యూల్‌బాబులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం మౌలానా అబుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసిఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో పేదరికాన్ని దూరం చేయగలమని, కులం, మతం, వర్గం ఇవేవీ విద్యకు ప్రామాణికాలు కావన్నారు. భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, స్వాతంత్ర్య సమరయోధులుగా, కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన మదరసా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి హిదయతుల్లా, మైనార్టీ నాయకులు అమీర్‌బాబు, మన్సూర్ ఆలీ, జిలానీ, మైనార్టీ, బీసీ సంక్షేమశాఖ అధికారులు, ముస్లిం మైనార్టీ పెద్దలు, పలువురు మైనార్టీ అధికారులు సంఘ సేవకులు, మదరసా నిర్వాహకులు పాల్గొన్నారు.

## భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడపక్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 12న అన్నమయ్య జిల్లా చిన్నమండెంకు రానున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టులో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సమీక్షించారు. మంగళవారం పోలీసుశాఖ, ఇతర శాఖల అధికారులతో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (ఏఆర్) రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కమలాపురం సీఐ ఎస్కే రోషన్, ఆర్ఐలు శివరాముడు, సోమశేఖర్ నాయక్, ఎయిర్‌పోర్టు డైరెక్టరు సుజిత్‌కుమార్, వైద్య, విద్యుత్, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


కోడిగాండ్లపల్లెలో విషజ్వరంతో

7 మహిళ మృతి

ఆర్ఎంపీ నిర్వాకం...

6 కంటి చూపు కోల్పోయిన కూలి


## నేడు కడపకు సీఎం చంద్రబాబు రాక

కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం కడపకు రానున్నారు. అన్నమయ్య జిల్లా పర్యటన ముగించుకుని హెలికాప్టరు ద్వారా సాయంత్రం 4.35కు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి విశాఖపట్టణం వెళ్లనున్నారు. ఈ మేరకు మంగళవారం అధికారిక ప్రకటన వెలువడింది.

## సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

● నేడు చిన్నమండెం రాక

● పేదల గృహప్రవేశాల్లో పాల్గొననున్న చంద్రబాబు



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ, సీఎం భద్రతా సిబ్బంది

చిన్నమండెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం చిన్నమండెం రానున్నారు. చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో పేదల గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10.40 గంటలకు ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో చిన్నమండెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 10.55 గంటలకు దేవగుడిపల్లె గ్రామంలో లబ్ధిదారులు కొత్తగా నిర్మించుకున్న ఇళ్ల వద్దకు చేరుకుంటారు. హేమలత, ముంతాజ్‌బేగం గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 11.50కు దేవగుడిపల్లెలో ఏర్పాటు చేసిన ప్రజావేదికకు చేరుకుంటారు. అక్కడ పలు స్టాళ్లను పరిశీలిస్తారు. 12 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పలువురు ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. గృహనిర్మాణ లబ్ధిదారులతో ముఖ్యమంత్రి 10 నిమిషాలు మాట్లాడుతారు. పీ4 బంగారుకుటుంబం లబ్ధిదారులతో 5 నిమిషాలు మాట్లాడుతారు. తర్వాత 1.40 గంటలకు పది నిమిషాల సేవ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లతో మాట్లాడుతారు. అక్కడి నుంచి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 1.45 నుంచి 2.25 వరకు లంచ్ బ్రేక్ తీసుకుంటారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం 4.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హెలికాప్టర్‌లో కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఏర్పాట్లు దగ్గరుండి పరిశీలిస్తున్నారు.

సీఎం రాక సందర్భంగా ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది, జిల్లా యంత్రాంగం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ పర్యవేక్షణలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆధ్వర్యంలో మంగళవారం చిన్నమండెంలోని ఏఆర్ కల్యాణ మండపంలో విస్తృత సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సీఎం భద్రతా బృందంతో కలిసి ఎస్పీ స్వయంగా కాన్వాయ్ రహార్సల్స్ నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్, పార్కింగ్, ప్రజా రవాణా సదుపాయాలపై ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమన్వయం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమీక్షలో అదనపు ఎస్పీలు ఎం.వెంకటాద్రి, ప్రకాశ్‌బాబు, సీఎం సెక్యూరిటీ అధికారి ఎస్ఎస్ఎస్‌వీ కృష్ణారావు, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తల కోసం సిద్ధమైన సభావేధిక



## స్పెషల్ కలెక్టరుకు ఊరట

● ప్రొద్దుటూరు ఈఆర్వోగా పలు ఆరోపణలు

● బోగస్ ఓట్ల తొలగింపులో ఎన్నికల సంఘం ఆదేశాలు బేఖాతర్

● ఎట్టకేలకు హెచ్చరికలతో కేసు ముగించిన కేంద్ర ఎన్నికల సంఘం

కలికిరి/ప్రొద్దుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రొద్దుటూరు నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో)గా పనిచేసిన కడప హంద్రీనీవా సుజల స్రవంతి భూసేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్ ఎం.రామమోహన్‌కు భారీ ఊరట లభించింది. ఆ నియోజకవర్గం ఓటర్ల జాబితాల్లో భారీగా నమోదైన చనిపోయిన, రెండేసి ఓట్లున్న పేర్లను తొలగించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరిపించాలంటూ స్థానిక నాయకుడు జి.వి.ప్రవీణ్‌రెడ్డి కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జనవరిలో సవరించిన ఓటర్ల జాబితాలు ప్రకటించాల్సి వుండగా 2023 సెప్టెంబరు నెల వరకు కూడా ఆయన పట్టించుకోలేదన్నది ఎన్నికల సంఘం ఆరోపణ. దీన్ని కేంద్ర ఎన్నికల సంఘం కూడా సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించింది. కడప జేసీ, డీఆర్వోల ఆధ్వర్యంలో సుదీర్ఘ విచారణ నిర్వహించారు. రామమోహన్ వైపు నుంచి కూడా వివరణలు తీసుకున్నారు. గత ఎన్నికలకు ముందు దీనిపై పెద్ద వివాదమే రేగింది. చివరికి జేసీ, డీఆర్వోల విచారణ నివేదిక రామమోహన్‌ను గట్టెక్కించింది. ఆయన తప్పిదాలను మన్నించాలని విచారణాధికారులు పంపిన నివేదికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో కూడా సానుకూలంగా సిఫారసు చేశారు. దీంతో రామమోహన్‌పై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఊరట కల్పించింది. అయితే భవిష్యత్ కాలంలో ఎన్నికల్లో ఎలాంటి తప్పిదాలకు పాల్పడరాదని హెచ్చరికలతో తదుపరి చర్యలను సరిపెట్టింది. ఈ మేరకు రామమోహన్‌పై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి మంగళవారం ఆదేశాలు జారీ చేసి కేసును ముగించారు.

## పూర్వ ఎంపీడీఓకు పెన్షన్ నిలుపుదల

● ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం

● ఆరోపణలు రుజువు కావడంతో జరిమానా

కలికిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండల ప్రజా పరిషత్తు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన (ప్రస్తుతం రిటైర్డు) కె.ఆంధ్రయ్యకు పూర్తి పెన్షన్ నిలుపుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మండలంలో పనిచేసేటప్పుడు ఉపాధి హామీ పథకం అమలులో భారీగా నిధులు దుర్వినియోగం చేసినట్లు నాలుగు ప్రధాన అంశాలపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పటి కడప జడ్పీ డిప్యూటీ సీఈవోను విచారణాధికారిగా నియమించారు. నాలుగు ప్రధాన అంశాలు పూర్తిగా రుజువైనట్లు పేర్కొంటూ విచారణాధికారి నివేదిక సమర్పించారు. దీనిపై ఎంపీడీవో ఆంధ్రయ్య నుంచి వివరణలు తీసుకున్నారు. అవేవీ సహేతుకంగా లేకపోవడంతో తాజాగా ఆయనకు వచ్చే పూర్తి పెన్షన్‌ను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

## సంక్షేమం, సంపద సృష్టే లక్ష్యం

● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత

● 7 పరిశ్రమల యూనిట్‌లకు శంకుస్థాపన



హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత, కలెక్టరు శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, మాధవి, చైతన్యరెడ్డి



వర్చువల్‌లో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు ముందుకు వెళుతున్నారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. మంగళవారం పరిశ్రమలు, - ఉపాధి కల్పనలో భాగంగా ప్రకాశం జిల్లా కనిగిరి పరిధిలోని పెద్దఈర్లపాడులో ఎంఎస్ఎంఈ పార్కుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లోని 50 ఎంఎస్ఎంఈ పార్కులకు సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో వీక్షిస్తూ స్థానిక కలెక్టరేట్ సభాభవనం నుంచి కడప జిల్లాలో రూ.4,322 కోట్ల పెట్టుబడులతో 1179.64 ఎకరాల్లో ఏడు పరిశ్రమల యూనిట్లకు శంకుస్థాపన చేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం మనదన్నారు. ఒకవైపు ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తూ మరో వైపు సంపదను సృష్టిస్తూ లక్షలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా వనరులను సమకూరుస్తున్న ముఖ్యమంత్రి ముందు చూపు ఉన్న గొప్ప నాయకుడన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి స్థానిక యువతకు పుష్కలంగా ఉపాధి అవకాశాలను అందించాలన్నదే సీఎం ధ్యేయమన్నారు. ఈ రోజు జిల్లాలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు శిలాఫలకాలు ఆవిష్కరించారని తెలిపారు. వచ్చే సంవత్సరంలోగా ఆయా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపా యాలను సమకూర్చి స్థానిక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు యూనిట్లు నెలకొల్పుకునే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. కలెక్టరు శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మంచి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న కొప్పర్తి పారిశ్రామికవాడను, రాష్ట్రంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే కొప్పర్తి పారిశ్రామికవాడలో జిల్లాకే తలమానికంగా ఎలక్ట్రానిక్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో పరిశ్రమలు రూపు దిద్దుకుంటున్నాయన్నారు. దీంతో జిల్లా యువతకు భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు, కాంట్రాక్టర్లకు, పెట్టుబడి దారులకు మంచి అవకాశాలు పెరగనున్నాయని తెలిపారు. సీఎం జిల్లాను పరిశ్రమల ఖిల్లాగా తీర్చిదిద్దుతున్నారన్నారు. జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు అనేవి మన దేశ ఆర్థిక బలోపేతానికి ఎంతో ప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈల పార్కులను ఏర్పాటు చేస్తుందన్నారు. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికే తలమానికంగా పారిశ్రామికరంగంలో జిల్లా ప్రగతి పథంలో అడుగులు వేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో లక్షలాది మందికి జీవనోపాధి కల్పన దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక అవకాశాలను అందిస్తున్నాయన్నారు. కార్యక్రమానికి హాజరైన జిల్లాకు చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలను అభినందిస్తూ మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టరుతో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం చాంద్‌బాషా, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసమూర్తి, పారిశ్రామికవేత్తలు, సంబంధిత అధికారులు తదితరులు హాజరయ్యారు.



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి సవిత, కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులు

## ఆర్‌ఎంపీ నిర్వాకం... కంటి చూపు కోల్పోయిన కూలి


శ్రీనివాస్‌యాదవ్ కంటి పరిస్థితి చూపుతున్న భార్య అంజలి

వాల్మీకిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వల్ల ఓ నిరుపేద కూలి ఏకంగా కంటి చూపు కోల్పోయిన సంఘటన వాల్మీకిపురం మండలంలోని జర్రావారిపల్లెలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు..జర్రావారిపల్లె గ్రామానికి చెందిన చుక్కా శ్రీనివాస్ యాదవ్ (45) తాపీ మేస్త్రీ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య అంజలి, కుమార్తె అశ్విని, కుమారుడు మణికంఠ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులతో శ్రమించి బిడ్డలను పోషించుకుంటున్నారు. ఇదిలా ఉండగా శ్రీనివాస్‌యాదవ్ తనకు జరిగిన విషయాన్ని మంగళవారం విలేకరులతో తన గోడును వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఏడాది సెప్టెంబరు 24న తన ఎడమ కన్ను నొప్పి ఎక్కువగా ఉండడంతో తాను వాల్మీకిపురంలోని ఆర్‌ఎంపీ డాక్టర్ చందు దగ్గరికి చికిత్స కోసం వెళ్లగా రెండు సూదులు వేసి కంటి చుక్కల మందు మాత్రలు ఇచ్చాడన్నారు. అదేరోజు మాత్రలు వాడి కంటి చుక్కలు వేసుకున్నానని అర్ధరాత్రి 12 గంటల సమయాన విపరీతమైన కంటి నొప్పి వచ్చి కన్ను బాగా ఉబ్బిపోయి, కంటిచూపు లేకుండాపోయిందని, మరుసటి రోజు మదనపల్లెలోని కంటి ఆస్పత్రిలో మూడు రోజులు, తిరుపతి అరవింద కంటి ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకున్నా ఫలితం మాత్రం లేదన్నారు. తరువాత మళ్లీ బెంగళూరుకు వెళితే అక్కడ రెండు మూడు ఆస్పత్రులలో కనీసం చేర్చుకోలేదని, ఎట్టకేలకు నేత్రదామ ఆస్పత్రిలో చేరి చికిత్సలు చేయించుకున్నానని, అయితే కంటి నొప్పి మాత్రం తగ్గిందని చూపు మాత్రం రాలేదని, ఆపరేషన్ చేస్తే దగ్గర చూపు మాత్రం రావచ్చని అక్కడి వైద్యులు చెప్పారన్నారు. ఆర్‌ఎంపీ చేసిన వైద్యంతోనే తనకు ఇలా జరిగిందని కన్నీటిపర్యంతమయ్యాడు. ఒకటిన్నర నెలలో సుమారు రూ.4 లక్షలు వైద్యం ఖర్చులయ్యాయని ఇప్పుడు మళ్లీ ఆపరేషన్‌కు రూ.2 లక్షలు కావాల్సి ఉండడం ఏమి చేయాలో అర్థం కాక ఇంటికి పరిమితయ్యాయని ఆవేదన చెందుతున్నాడు. తన 18 ఏళ్ల వయసులో కూలి పనులకు వెళ్లిన సమయాన తనకుడి కంటికి రాయి తగిలి అప్పుడు కుడి కంటి చూపు కోల్పోయానని, ఇప్పుడు ఉన్న ఎడమ కన్ను కూడా ఇలా అవడంతో ఎలా బతకాలి, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి అంటూ రోదిస్తున్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని అధికారులు గుర్తించి మరెవ్వరికీ జరగకుండా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌యాదవ్ కోరుతున్నాడు. అలాగే నిరుపేద అయిన తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. ఈ విషయమై సంబంధిత ఆర్‌ఎంపీ డాక్టర్ చందును వివరణ కోరగా శ్రీనివాస్ తన దగ్గరకు వచ్చినప్పుడు కంటికి సంబంధించే వైద్యం చేశానని, అయితే తిరిగి వాళ్లు కంటి పసురు లాంటివి వాడి ఉండవచ్చని చెప్పడం గమనార్హం.

## పూర్వ ఏడీఏ సావిత్రికి జరిమానా

● పరాకాష్టకు చేరిన అవినీతి ఫలితం
● సాటి ఉద్యోగుల నుంచే లంచాలు

కలికిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గతంలో రాయచోటి వ్యవసాయ శాఖ ఏడీఏగా పనిచేసిన సావిత్రికి జరిమానా విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చిత్తూరు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏడీఏగా పనిచేస్తున్న సావిత్రి రాయచోటిలో పనిచేసే కాలంలో తన కింది ఉద్యోగుల నుంచి లంచాల కోసం పీడించినట్లు ప్రధాన ఆరోపణ. నాలుగేళ్లుగా దీనిపై కొనసాగిన విచారణల అనంతరం సావిత్రి వైపు నుంచి సంజాయిషీలు, వివరణలు తీసుకున్న తరువాత తాజాగా ఆమెకు రెండు ఇంక్రిమెంట్లు పూర్తి సర్వీసు కాలంలో (క్యుమ్యులేటివ్ ఎఫెక్ట్‌తో) కోత విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. డబ్బులు డిమాండ్ చేస్తూ ఏడీఏ సావిత్రి వేధింపులు భరించలేక రాయచోటి డివిజన్‌లోని సచివాలయ వ్యవసాయ, పశు సంవర్ధక సహాయకులు, వీఎస్‌ఏలు, ఎంపీఈవోలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అప్పటి కడప జాయింట్ కలెక్టర్ విచారణ నిర్వహించి సావిత్రి నిర్వాకాలపై 2021 మే 15 ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కమిషనరును ప్రభుత్వం ఆదేశించింది. సావిత్రి నుంచి వివరణలు తీసుకున్న అనంతరం గుంటూరు జేడీఏ వి.డి.కె.కృపాదాస్‌ను, డీడీఏ ఎన్‌సీహెచ్ బాలూనాయక్‌లను విచారణాధికారులుగా నియమించారు. ఆ తరువాత గుంటూరు అదనపు డైరెక్టర్ బి.ప్రసాద్ చేత కూడా విచారణ జరిపించారు. మొత్తం మీద అన్ని విచారణల్లోనూ సావిత్రి అవినీతికి పాల్పడ్డట్లు పూర్తి ఆధారాలున్నట్లు నివేదికలు ప్రభుత్వానికి అందాయి. చివరిసారిగా సావిత్రి వైపు నుంచి వివరణలు తీసుకున్న అనంతరం ఆమె పూర్తి సర్వీసు కాలంలో రెండు ఇంక్రిమెంట్లు కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

## ఆజాద్ సేవలు చిరస్మరణీయం : డీఆర్వో

రాయచోటి నేతాజీసర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్‌కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత తొలి విద్యాశాఖ మంత్రి, మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి డీఆర్వో, ప్రజాప్రతినిధులు, అధికారులు, పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌బాటలో మనందరం నడవాలన్నారు. ఆయన భారత విద్యా వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు అన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్. మస్తాన్‌బీ మాట్లాడారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అసదుల్లా, హసీం, మహమ్మద్‌అలీ, మహమ్మద్‌ఖాన్, షామీర్, సిబాతుర్ రెహమాన్ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయ సూపరింటెండెంట్ డేవిడ్, కోఆర్డినేటర్ కరీముల్లా నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో ఎద్దు మృతి


వెలగచర్ల వద్ద కరెంటు షాక్‌తో మృతిచెందిన ఎద్దు

పెనగలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ ఎద్దు మృతి చెందింది మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీ గల వెలగచర్లలో మంగళవారం నాగరాజ అనే వ్యక్తికి చెందిన ఎద్దును మేత కోసం అతని అత్త చేలలోకి వదిలిపెట్టింది. దీంతో అది చెరువు గట్టుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఎద్దు లక్ష రూపాయలు విలువ చేస్తుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## ప్రజల జీవనోపాధి విధి విధానాలపై ఆరా

● లక్కిరెడ్డిపల్లె, కురబలకోటలో ట్రైనీ కలెక్టర్లు


బి.యర్రగుడి పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

లక్కిరెడ్డిపల్లె/కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల ప్రజల జీవనోపాధిపై ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు ఆరా తీశారు. మంగళవారం బి.యర్రగుడి గ్రామంలో వారు పర్యటించారు. గ్రామ అభివృద్ధి, పరిపాలన విధానం, ప్రజల జీవనోపాధిపై సర్పంచుతో మాట్లాడారు. గ్రామంలో పర్యటించి పరిశుభ్రతపైన అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, వారు తమ పిల్లలను చదివించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. భూసమస్యలు, రెవెన్యూ విధానం, పంచాయతీ అభివృద్ధి అన్న విషయాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఐపీఎస్ తరుణ్‌యాదవ్, హర్షవర్ధన్, ఐఎఫ్ఎఫ్, తన్మేజ ఐఆర్ఎస్, సౌరబ్‌కుమార్ ఐఆర్ఎస్, వినీత్‌జాదవ్ ఐఆర్ఎస్, తనక డి.ఆనంద్, ఐఆర్ఎంఎస్, ఎంపీడీవో రెడ్డెయ్య, ఈవోపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ సెక్రటరీ నాగమణి, అధికారులు పాల్గొన్నారు.


అంగళ్లులో టెర్రకోట వద్ద ట్రైనీ కలెక్టర్లు

### కనసానివారిపల్లెలో...

కనసానివారిపల్లె, అంగళ్లులో ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు మంగళవారం పర్యటించారు. విధుల నిర్వహణలో శిక్షణ తీసుకునే కార్యక్రమంలో భాగంగా కురబలకోటలో మూడు రోజుల శిక్షణకు వచ్చారు. రెండోరోజు కనసానివారిపల్లె సచివాలయం, రైతు సేవా కేంద్రంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో సమావేశమయ్యారు. అనంతరం అంగళ్లు సమీపంలో టెర్రకోట కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ మట్టిబొమ్మల తయారీ, మార్కెటింగ్ తదితర వాటిపై టెర్రకోట ప్రతినిధులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్లు ప్రతివలామా, హరిప్రసాద్ పోతరాజు, ఆశిశర్మ, విబోర్ భరద్వాజ్, పాటిల్ కృష్ణ బద్రువన్, ఆనంద్ ప్యారేలాల్, ఎంపీడీవో గంగయ్య, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు, కార్యదర్శులు గిరి, రామప్పనాయుడు పాల్గొన్నారు.

## డైట్‌లో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

● విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిత్యజీవితంలో ఎదురయ్యే సవాళ్లను సునాయాసంగా అధిగమించేందుకు గుణాత్మక విద్య దోహదం చేస్తుందని, అటువంటి విద్యకు మార్గదర్శి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అన్నారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం డైట్ కేంద్రంలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన చదువుల ద్వారానే మానవాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశ భవిష్యత్తును రూపొందించడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్య ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరుకాని నిందితుడి కోసం గాలింపు చర్యలు

రైల్వేకోడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోర్టుకు హాజరుకాని నిందితుడి కోసం భద్రాచలం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లు ప్రసాద్, భద్రయ్య మంగళవారం రైల్వేకోడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలోని కే.బుడుగుంటపల్లెకు చెందిన గండికోట సూర్యం 2010లో భద్రాచలం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళపై అత్యాచార యత్నం చేశాడని తెలిపారు. ఈ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు, ఆ తర్వాత కోర్టుకు హాజరు కాలేదన్నారు. కోర్టు ఆదేశాల మేరకు స్థానిక పోలీసుల సహకారంతో రైల్వేకోడూరులో గాలిస్తున్నామని తెలిపారు. నిందితుడి ఆచూకీ తెలిస్తే రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని కోరారు.

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

## అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు

అనూ ఇమ్మాన్యుయేల్



'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.

## కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం



'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

## మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

## భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

## నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

## ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

## నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున




'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనుసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

## సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

## ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

## ట్రాక్టర్‌ను దొంగిలించిన వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, నిందితుని చూపుతున్న పోలీసులు

కాశినాయన నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సావిశెట్టిపల్లెలో వారం రోజుల క్రితం ఓ ట్రాక్టర్ చోరీకి గురైంది. ఈ కేసులోని నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ముడమాల సుదర్శన్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్, ట్రిల్లర్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేసి పోట్లదుర్తి గ్రామానికి చెందిన పులి పెద్ద గంగరాజు కుమారుడు అంజన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. అతను ట్రాక్టర్, ట్రిల్లర్ చోరీ చేసినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

## రైల్వేగేటును ఢీకొన్న పాల వ్యాన్

● కమలాపురంలో గంటపాటు ట్రాఫిక్ జామ్



గేటు దెబ్బతినడంతో నిలిచిపోయిన వాహనాలు

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేగేటును పాలవ్యాను ఢీకొనడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించిన సంఘటన కమలాపురం పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం రైల్వే గేటు దాటుతున్న సందర్భంలో పాల వ్యాను ప్రమాదవశాత్తు గేటును ఢీకొంది. దీంతో రైల్వేగేటుకు డ్యామేజీ అయ్యింది. ఈ సమాచారం తెలుసుకున్న రైల్వే సిబ్బంది రైల్వే గేటును రిపేరు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే రిపేరుకు ఎక్కువ సమయం పట్టడం, స్కూలు వదలే సమయం కావ డంతో విద్యార్థులు, ప్రయాణికుల రద్దీతో ట్రాఫిక్ స్తంభించి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటపాటు గేటు వద్దనే నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఇటీవల కురిసిన వర్షానికి అండర్ బ్రిడ్జిలో నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ద్విచక్రవాహనదారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## మళ్లీ కేబుల్ చోరీ

● వరుస సంఘటనలతో ఆందోళనలో రైతులు

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి చింతల, దిగువపల్లె గ్రామ పొలాల్లో బోరుబావులకు రైతులు ఏర్పాటు చేసుకున్న కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఇప్పటికే అరటి ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా దొంగలు వరుసగా కేబల్ వైర్లను చోరీ చేస్తుండడతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. సోమవారం రాత్రి సుమారు 40 మంది రైతులకు సంబంధించిన కేబుల్ వైర్లను దొంగతనం చేశారు. దీని విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. దొంగలు కేబుల్ వైర్‌ను కాల్చి గుజిరీకి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని, మళ్లీ కొత్తగా కేబబుల్ వైర్ కొనాలంటే ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోందన్నారు. దొంగతనాలు వరుసగా జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు. పోలీసులు కేబుల్ దొంగలను పట్టుకొని దొంగతనాలు జరగకుండా చూడాలని వారు పేర్కొన్నారు.

## హత్య కేసులో 9 మంది అరెస్టు

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పెద్దదర్గా సమీపంలో శనివారం అర్ధరాత్రి అబూబకర్ అనే యువకుడిని హత్య చేసిన కేసుకు సంబంధించి 9 మందిని నకాశ్ సమీపంలోని కేసీ కాల్వ వద్ద మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. సీఐ వివరాల మేరకు... కడప కుమ్మరి కుంటకు చెందిన అబుజార్, ఆలియస్ అబుషేక్ మహ్మద్ యూసఫ్ మధ్య మనస్పర్ధలు ఉండేవి. శనివారం ఒంటరిగా ఉన్న అబూబకర్‌ను కత్తితో పొడిచి హత్య చేసినట్లు తెలిపారు. ఈకేసుకు సంబంధించి నిందితులైన అబూబజార్ ఆలియాస్ యూసుఫ్, గౌస్‌నగర్‌కు చెందిన ఆజంబాషా, ఆసిఫ్, లతీఫ్‌లతో పాటు మరో నలుగురు మైనర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తి, ఓ సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుగురిని రిమాండుకు, మైనర్లను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చదిపిరాళ్ల పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న పెంచలయ్యకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఎంపీడీవో గౌస్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొని, ఫొటోలను వాట్సప్ గ్రూపులో పంపించాల్సి ఉంది. అయితే చదిపిరాళ్ల పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య పాత ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ కార్యదర్శికి మెమో ఇచ్చి వివరణ కోరారు. ఈ మేరకు పెంచలయ్యకు షోకాజ్ నోటీసులు ఇచ్చి, మూడురోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా కోరామని ఆయన తెలిపారు.

## ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్త... ప్రభుత్వ లక్ష్యం

మైదుకూరు నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే రాష్ట ప్రభుత్వం లక్ష్యమని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాలంపేటలో 42 ఎకరాలలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కు శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డ్వామా పీడీ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తోందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తోందని తెలిపారు. బద్వేల్ ఆర్‌డీఓ చంద్రమోహన్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఏరియాలో పరిశ్రమలను ఏర్పాటు చేసుకున్న నిరుద్యోగ యువతకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడమేకాకుండా మౌలిక వసతులను ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి,రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి డైరెక్టర్ దాసరిబాబు మాట్లాడుతూ ప్రభు త్వ రాయితీతో పాటు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం ఉన్నందున మహిళా సంఘాలు, నిరుద్యోగులు పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు రాజసింహ నరేంద్ర, సొసైటీ ఛైర్మన్ మారుతీ, బీఎస్ శ్రీను, ఆర్.శ్రీనివాసులు, ధనపాల రవి, మెప్మా అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు



మిల్లెట్స్ ఆహార ఉత్పత్తుల వ్యాపారవేత్త ప్రమీలకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న బీటెక్ రవి

### అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవకాశాలు కల్పిస్తున్నారని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ ఇస్టా ఆడిటోరియంలో పరిశ్రమలు- ఉపాధి కల్పన అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీటెక్ రవి మాట్లాడుతూ ఎవరిమీద ఆధార పడకుండా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పులివెందులలో ఏపీఐఐసీ భూములు ఉన్నాయి, ఇక్కడ పరిశ్రమలు స్థాపించుకునేందుకు అవకాశం ఉందన్నారు. పరిశ్రమలు పెట్టి పది మందికి ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. అనంతరం డ్వాక్రా రుణాలతో పరిశ్రమలు స్థాపించిన ప్రమీల, వెంగమ్మలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పులివెందుల వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, సంయు గ్లాస్ ఫ్యాక్టరీ, ఆదిత్య బిర్లా ఫ్యాక్టరీ ప్రతినిధు లు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు



విజేతలతో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఏపీ స్టేట్ లెవల్ మినీ (అండర్-11 బాల, బాలికల) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 250 మందికి పైగా క్రీడాకారులు హాజరు కాగా, క్వాలిఫై రౌండ్స్ ముగిసిన వారిని మెయిన్ డ్రాకు ఎంపిక చేశారు. తదుపరి ఈ నెల 9 నుంచి లీగ్ మ్యాచ్ నిర్వహించి 10న ప్రీ క్వార్టర్స్, క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు చేట్టారు. చివరి రోజు అయిన మంగళవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు.

రాష్ట్రస్థాయి మినీ అండర్ 11 బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల బాలుర విభాగంలో సింగిల్ ఫైనల్ విజేతగా కార్తీక్ (అనంతపురం) నిలచారు. బాలికల సింగిల్ విభాగంలో సీతప్రియాంక్ (వైజాగ్) విజేతగా నిలిచారు. బాలుర డబుల్స్ విభాగంలో ఫైనల్ విజేతగా ఎం.దేవాన్ష్ రుషి, ఎస్‌షాహిర్ (చిత్తూరు) విజేతలుగా నిలిచారు. అలాగే బాలికల డబుల్స్ విభాగంలో కె.శ్రీఆద్యా రెడ్డి (వెస్ట్ గోదావరి), మధులిక (చిత్తూరు) విజేతలుగా నిలిచారు. విజేతలకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భాస్కర్‌రెడ్డి హాజరై బహుమతులు అందించారు. డీఎస్‌డీవో గౌస్‌బాషా, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజుతో పాటు పలువురు కోచ్‌లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## జాతీయ విపత్తుల శిక్షణ పూర్తి చేసుకున్న కడప స్కౌట్ విద్యార్థి



కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 7వ జాతీయ విపత్తుల శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో అక్టోబరు 15 నుంచి నిర్వహించిన 22రోజుల ప్రత్యేక శిక్షణ శిబి రంలో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన స్కౌట్ విద్యార్థి పి.వెంక టరమణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఏకైక అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహించారు. కడప నగరం శ్రీహరి డిగ్రీ కళాశా లలో చదువుకునే సమయంలో స్కౌట్ తరఫున గతంలో ఈయన పాల్గొన్నారు. కాగా యువ ఆపద మిత్ర శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఏపీ నుంచి వెంకటరమణ ఒక్కరికే అవకాశం లభించడం విశేషం. ఈ సంద ర్భంగా జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు వెంకటరమణకు అభినందనలు తెలిపారు.

## రూ.14 కోట్లతో ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రారంభం



ఎంఎస్‌ఎంఈ పార్కు ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, అధికారులు

ప్రొద్దుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలో రూ.14 కోట్లతో ఎంఎస్ ఎంఈ పార్కును ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో వర్చువల్‌గా ప్రారంభించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో పరిశ్రమలు, ఉపాధి కల్పన అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లా డుతూ ప్రొద్దుటూరులో రూ.14 కోట్లతో చేపట్టే ఈ ఎంఎస్‌ఎంఈ పార్కు ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పన అవకాశాలు పెరుగుతా యన్నారు. ఈ పనులను ఏపీఐఐసీ త్వరితగతిన చేపట్టాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి మాట్లాడుతూ గోల్డ్ మార్కెట్‌కు అనుసంధానంగా ఏర్పాటు కాబోయే ఈపరిశ్రమలో ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బచ్చల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, జడ్పీ ఈఈవో ఓబులమ్మ, ఆర్‌డీవో సాయిశ్రీ, వాల్మీకి బోయ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ వద్ది సురేఖ, ఎంపీడీవో సూర్యనారాయణ, రాజుపాళెం ఎంపీ డీవో రామనాధ్‌రెడ్డి, మెప్మా అధికారులు, మున్సిపల్ కౌన్సిల్లర్లు పాల్గొన్నారు.

## యువతకు ఆదర్శం అబుల్‌కలాం ఆజాద్



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేటి తరం యువత మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య పేర్కొన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ జయంతిని దేశంలో జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఆయన ప్రఖ్యాత పండితుడని, అరబిక్, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలి అనేకభాషల్లో ప్రావీణ్యుడన్నారు. స్వాతంత్ర్య సమరఘట్టంలో ముఖ్య నాయకులన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శివరాముడు, శ్రీశైలరెడ్డి, సోమశేఖర్‌నాయక్, డీపీవో ఏవో వెంకటరమణ, ఆర్‌ఎస్‌ఐలు వెంక టేశ్వర్లు, స్వామినాయక్, అప్పలనాయుడు, డీపీవో, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే పంచాయతీల అభివృద్ధి

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాళహస్తి సీనియర్ ఫ్యాకల్టీ సరళ అన్నారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జిల్లాస్థాయిలో అన్ని మండలాల ఎంపీడీవోలకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీ మాట్లాడుతూ సుస్థిరత అభివృద్ధికి, మంచి ఆదాయ వనరులకు గ్రామ పంచాయతీలు కీలకమన్నారు. సొంత ఆలోచనలతో స్థానికంగా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రతి మండలంలో అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి, పరిశుభ్రత ఎవరికి వారు విధి నిర్వహణలో నిక్కచ్చిగా పనిచేసినప్పుడే సాధ్యమ వుతుందన్నారు. తద్వారా ఆ పంచాయతీలు రాబోవు కాలంలో మంచి అభివృద్ధితో ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీపీవో రాజ్యలక్ష్మి, డీడీవో మైథిలి, డీఎల్‌డీవో శేషయ్య, డీఎల్‌పీవో రమణారెడ్డి, ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ



వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రమేయం ఉన్నట్లు తెలిసినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. స్థానిక పోలీ సులు, అధికారులతో శాంతి భద్రతలపై ఆరా తీశారు. ఫ్యాక్షన్ గ్రామాల పరిస్థితుల గురించి వాకబు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా పోలీసులు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో నిద్రించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, బెట్టింగ్ తదితరవి ఎక్కడ జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. పోలీసులకు ప్రమేయం ఉన్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని, రాత్రి వేళల్లో నైట్‌బీట్‌లు పకడ్బందీగా ఉండాలని, నేరాలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసుల పనితీరు ఉండాలన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజల పట్ల పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలని, సమ స్యలను విని ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మెరుగుపరచాలన్నారు.

## పటిష్ట స్థితిలో కడప జట్టు

● స్వల్ప స్కోర్‌కే చేతులెత్తేసిన అనంతపురం



శివచరణ్ (కడప), పంకజ్ (అనంతపురం), మణిదీప్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం నెల్లూరు జట్టుపై కడప జట్టు పటిష్ట స్థితిలో వుండగా, చిత్తూరు జట్టుపై అనంతపురం జట్టు స్వల్ప స్కోర్‌కే చేతులెత్తేసింది. వివరాలిలా.....

నగర శివారు ప్రాంత కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టింది. మొదటిరోజు ఆట ముగిసే సమ యానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 280 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. ఇందులో శివచరణ్ 151 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు- అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం తన మొదటి ఇన్నింగ్స్‌లో 54 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 146 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పంకజ్ 88 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ మణిదీప్ 5 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 40.1 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 80 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు మరో 66 పరుగుల వెనుకంజలో వుంది.



## కోడిగాండ్లపల్లెలో విషజ్వరంతో మహిళ మృతి



గంగాదేవి మృతదేహం అనాథలుగా మారిన పసిపిల్లలు



గంగాదేవి (ఫైల్)

ముద్దనూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోడిగాండ్లపల్లెలో ఓ మహిళ విషజ్వరంతో మృతి చెందింది. రెండు నెలల క్రితం గ్రామంలో గండికోట బ్యాక్ వాటర్ వల్ల ప్రజలకు విషజ్వరాలు సోకి ఓ చిన్నారి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవక ముందే గ్రామంలోని గంగాదేవి(40)అనే మహిళ విషజ్వరంతో మృతి చెందడంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే... కోడిగాండ్లపల్లెకు చెందిన జి.నడిపి సుబ్బరాయుడుకు 20 సంవత్సరాల క్రితం గంగాదేవితో వివాహమైంది. సంతానం లేకపోవడంతో ఒకటిన్నర సంవత్సరం క్రితం సంతానం కోసం చైన్నైలోని ఓ ఆసుపత్రిలో కృత్రిమ గర్భధారణ చేయించుకున్నారు. తరువాత కొండాపురంలో నున్న అమ్మగారి ఇంటి వద్ద ఉండి కొద్ది నెలలు ప్రొద్దుటూరులో చికిత్స చేయించుకున్నారు. అనంతరం ఇద్దరు కవలలు అవని, హర్షితలు జన్మించారు. ఇప్పటికి చిన్నారుల వయస్సు 10నెలలు, నాలుగు నెలల క్రితం గంగాదేవి పిల్లలను తీసుకొని కోడిగాండ్లపల్లెకు వచ్చింది. 15 రోజుల నుంచి అనారోగ్యానికి గురైంది. విషజ్వరంతో బాధపడుతున్న గంగాదేవిని ప్రొద్దుటూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. వారం రోజుల క్రితం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతదేహాన్ని కోడిగాండ్లపల్లె తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. కేవలం గండికోట బ్యాక్ వాటర్ వల్ల విషజ్వరంతోనే తన భార్య మృతి చెందినట్లు సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిలేని చిన్నపిల్లలను చూసి గ్రామం శోకసంద్రంలో మునిగింది.

**విషజ్వరాలు లేవు....**

నెల రోజులుగా కోడిగాండ్లపల్లెలో విషజ్వరాలు లేవు. గంగాదేవి చెన్నైలో పిల్లల కోసం కృత్రిమ గర్భధారణ చేయించుకుంది. తరువాత కొండాపురంలోని తల్లిగారి ఇంటిలో ఉంది. కోడిగాండ్లపల్లెకు ఇప్పటి వరకు రాలేదు. అనారోగ్యంతో ఉండటంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఆధార్‌కార్డు ఆధారంగా ముద్దనూరు మండల వాసిగా గుర్తించారు.

- కరీష్మ, ప్రభుత్వ వైద్యురాలు, ముద్దనూరు

## కృత్రిమ మేధస్సు మంచిదే...

● మానవతా విలువలు ముఖ్యం ● వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): కృత్రిమ మేధస్సు యుగంలో మానవతా విలువలు, సృజనాత్మకత, నైతిక స్పృహను కాపాడుకోవాల్సిన అవ సరం ఉందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. మంగళ వారం జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని వైవీయూ సర్ సీవీ రామన్ సైన్స్ భవనంలో వీసీ అధ్యక్షతన అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

అనంతరం జరిగిన సమావేశంలో కర్నూ లు డాక్టర్ అబుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై.నరసింహులు కీలక ఉపన్యాసం చేస్తూ డిజిటల్ లెర్నింగ్ వాతావరణంలో మానవత్వం ప్రాముఖ్యతను వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పీఎం ఉష సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ సమన్వయం చేశారు. ఉర్దూ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో పీఎం ఉష, మైనారిటీ సెల్, ఉర్దూ విభాగం సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించగా పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి



సలహాలు ఇస్తున్న జేడీఏ చంద్రానాయక్

సింహాద్రిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించి తెగుళ్లబారి నుంచి పంటను రక్షించుకో వడంతో పాటు అధిక దిగుబడులు సాధించాలని జేడీఏ చంద్రానాయక్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని గురిజాల, బి.చెర్లోపల్లె గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్దనూరు ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ రామాంజులరెడ్డి, హెచ్‌ఓ మల్లేశ్వరరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**చక్రాయపేటలో..:** మండలంలోని నెర్సుపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, డ్రోన్ టెక్నాలజీ, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటి వనరులతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కూరగాయలు, మామిడి, అరటితదితర పంటలకుఎక్కువగా ఆధునిక పద్ధతులు పాటించాలన్నారు. అలాగే తక్కువ పెట్టుబడులు పెట్టి అధిక దిగుబడులు సాధించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగుచేయాలన్నారు. ఆరోగ్యకర ఉత్పత్తు లను పండించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్..:** మండలంలోని పెద్దరంగాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ చెన్నారెడ్డి మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులు, పురుగుమందులు వాడరాదని రైతులకు సూచించారు. పులివెందుల మండలంలో సాగుచేసిన శనగ పంటలో అక్కడక్కడ అధిక తేమ శాతం వల్ల కాలర్‌రాట్ తెగులు గమనించడం జరిగిందన్నారు. దీని నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి ఆరోగ్యకర ఉత్పత్తులను పండించడంతో పాటు ఆరోగ్యకర వాతావరణాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిరికల్చర్ టీఏ జగన్నాథ్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ ఎంటీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

**కడప రూరల్..:** పంట సాగులో సేంద్రియ ఎరువులను ఉపయోగించడం వలన ఆశించిన దిగుబడులను సాధించవచ్చని ఏవో సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కడప మండలంలోని పాతకడప గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కవిత, రాధిక, రైతులు పాల్గొన్నారు.

**కమలాపురం రూరల్..:** విత్తనశుద్ధి ద్వారానే తెగుళ్లు నివారించవచ్చని ఏవో సరస్వతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రగుడిపాడు , పందిళ్లపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనగ పంట వేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు.రైతులకు అందుబాటులో జిప్సం ఉందని, కావలసిన వారు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

## ఘనంగా రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కాల సర్ప దోష నివారణ పూజలు (రాహుకాల పూజలు) రాయలసీమ జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై చేశారు.

## గ్రాంట్ విడుదల హర్షణీయం



శివశంకర్‌రెడ్డి

కడప రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా చనిపోయిన 1150 మంది న్యాయవాదుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.46 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయడం పట్ల టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గంగిరెడ్డి శివశంకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని టీడీపీ లీగల్‌సెల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చనిపోయిన ఒక్కో న్యాయవాది కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున సకాలంలో సొమ్ము విడుదల చేసినందుకు న్యాయవాదులు, లీగల్ సెల్ తరుపున ఆయన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆధార్ నవీకరణ సద్వినియోగం చేసుకోవాలి

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా ఆధార్ బయో మెట్రిక్ నవీకరణచేసుకునే అవకాశం కల్పించిందని, విద్యార్థులందరూ తమ ఆధార్‌కార్డుల నవీకరణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రామకృష్ణయ్య అన్నారు. మండలంలోని ఇప్పట్ల గురుకుల పాఠశా లలో మంగళవారం విద్యార్థుల ఆధార్ నవీకరణ క్యాంప్ ఏర్పాటుచేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ క్యాంప్ ఏర్పాటుచేస్తున్నామని ఆయా పరిధిలోని పిల్లలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎస్సీ రుణాల ఇంటర్వ్యూలను వెంటనే నిర్వహించాలి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలను నిర్వహించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కె.మునయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జిమంత్రి సవితని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా కార్యదర్శి కానగల మునెయ్య, జిల్లా నాయకులు చంద్రగుప్తలు కలిసి వినతిపత్రం సమర్పించారు.

## బీసీ రుణాలకు వెంటనే సబ్సిడీ విడుదల చేయాలి

కడప మారుతీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం మజూరు చేసిన బీసీ రుణాలకు వెంటనే సబ్సిడీ విడుదల చేయాలని అలాగే మంజూరు కాని రుణాలను కూడా వెంటనే మంజూరు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితను మంగళవారం కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో పలువురు బీసీ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలోఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, బీసీ నాయకులు అవ్వారు మల్లికార్జున పాల్గొన్నారు.

## ఢిల్లీలో పేలుళ్లు జరగడం బాధాకరం

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో మెట్రో స్టేషన్ వద్దపేలుళ్లు జరగడం అత్యంత బాధాకరమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష తెలిపారు. పేలుళ్ల ఘటనపై విచారణ చేపట్టి దీని వెనుకున్న వారిని ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం మాజీ డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేలుళ్ల ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర కార్యదర్శి నగర అధ్యక్షుడు మహమ్మద్ షఫీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వన్ స్టాప్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రిమ్స్ ఆవరణంలోని వన్ స్టాప్ సెంటర్ సేవలను ఆపదలో ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం రిమ్స్ ఆవరణంలోని వన్‌స్టాప్ సెంటర్‌ను, రిమ్స్‌ను విజిట్‌చేశారు. పలు విభాగాలను, రిజిస్టర్లను పరిశీలించారు. నేషనల్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తెలిపారు.



## సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా స్థానిక మల్లేశ్వరాలయంలో కొలువై ఉన్న కుమార స్వామికి మంగళవారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామునే స్వామివారికి అభిషేకాలతో పాటు అలంకరణ గావించారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి దర్శించుకున్నారు.

## 'ఢిల్లీ బాంబు పేలుడు సంఘటన అమానుషం'

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశరాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుళ్ల సంఘటన అత్యంత అమానుషమని వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడుకాశిభట్ల సత్యసాయినాధశర్మ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన బాంబు పేలుళ్ల సంఘటన అమాయక ప్రజలు మృతి చెందడం తీవ్ర విచారకరమన్నారు. ఇంతటి క్రూరంగా వ్యవహరించడం పిరికిపంద చర్య అన్నారు. ఈ పేలుళ్లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## ప్రతి మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీ రాజ్యలక్ష్మి

వేముల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం వేములలోని శ్రీశక్తిభవన్‌లో వెలుగు గ్రామీణ పేదరికనిర్మూలన సంస్థ పథకాల ప్రగతి సమీక్ష సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకోసం మహిళా సంఘ సభ్యుల జీవనోపాధుల మెరుగుదలకు ప్రతి మహిళా ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగడానికి శ్రీనిధిఉన్నతి సామాజిక పెట్టుబడి నిధి బ్యాంకులింకేజీ రుణాలను మంజూరు ప్రగతిని వేగవంతం చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలలోను గ్రామ సమాఖ్యలలోను ఆర్థిక లావాదేవీలను డిజిటలైజ్ చేయడం జరిగిందన్నారు. అనంతరం శ్రీనిధి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు, సీసీలు పాల్గొన్నారు.


## 16న తొగట వీరక్షత్రియుల కార్తీక మాస వన భోజనం



మాట్లాడుతున్నతొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నేతలు

కడప కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట రోడ్డులోని కనుమలోపల్లి శనీశ్వరాలయం పక్కన ఉన్న 108 శివలింగాల మహాలింగేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 16న ఉదయం10గంటలకు కడప నగర తొగట వీరక్షత్రియుల కార్తీక మాస వన భోజనకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షుడు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లానరసింహారావు తెలిపారు. మంగళవారం ఎర్రముక్కపల్లెలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మహిళలకు పిల్లలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లా మురళీక్రిష్ణయ్య ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, వెలిగండ్ల సుబ్బరాయుడు, బొలిశెట్టి వెంకటస్వామి, దొండ్ల వెంకటరమణ, టేకూరి పుష్పాంగద, కాల్వ వాగేష్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం



వినతులు స్వీకరిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, నవంబరు 11 (ఆం ధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పు లివెందుల ని యోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## 'అవినీతి ఊబిలో బీఈడీ కాలేజీలు'

కడప మారుతీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రొద్దుటూరులో ఉన్న ఓ బీఈడీ కళాశాల అవినీతి ఊబిలోకూరుకపోయిందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎన్జీవో కాలనీలో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హత లేని బీఈడీ కళాశాలలను తొలగించాలని కోరారు. సమావేశంలో నాయకులు అమర్‌నాథరెడ్డి, ప్రవీణ్, బీజేవైయం రాష్ట్ర నాయకుడు పవన్ కుమార్ పాల్గొన్నారు.

## హయ్యర్ పెన్షన్ అమలుచేయాలి

కడప మారుతీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హయ్యర్ పెన్షన్ మంజూరవుతందన్న ఆశతో గత 2024-25 సంవత్సరాలలో హయ్యర్ పెన్షన్ గాను డీడీలే కట్టిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వాలు స్పందించి త్వరిత గతిన పెన్షన్ మంజూరయ్యేలా చూడాలని ఏపీ ఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కైలాసనాథ్, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ సుబ్బారెడ్డి, వై. రవీంద్రనాథ్‌వర్మ డిమాండ్ చేశారు. ఏపీ ఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కడప రీజియన్ పీఎఫ్ రీజనల్ కమిషనర్-1 వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల నుంచి అసోసియేషన్ ప్రతినిధులు కె. రాజారెడ్డి, శ్రీనివాసులు, నారాయణ పాల్గొన్నారు.

## ర్యాలీని విజయవంతం చేయాలి

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని వైసీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 12న జరిగే ప్రజా ఉద్యమ ర్యాలీని విజయ వంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.అనంతరం తహసీల్దారు కు వినతిపత్రం అందిస్తామన్నారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు

## ఆజాద్‌కు ఘన నివాళి

పులివెందుల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హఫీజ్,కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'అక్రమ సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్న వైవీయూ అధికారులు'

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):యోగివేమన విశ్వవిద్యాలయం అధికారులు అక్రమ సంపాదనలు కూడబెట్టుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడారు.

## జనవరి నుంచి కార్మికుల కూలి రేట్లు పెంపు

కడపనాగరాజుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జనవరి 2026 1వ తేదీ నుంచి భవన నిర్మాణ కార్మికుల కూలి రేట్లు పెంచుతున్నట్లు ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా గౌరవాధ్యక్షులు మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లింగన్న తెలిపారు. మంగళవారం కడప రవీంద్రనగర్ భవననిర్మాణ కార్మికుల అడ్డాలో ఈనెల 30వ తేదీలలో కడపలో జరిగే రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాంతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగస్వామి, మల్లేష్ పాల్గొన్నారు.

## పత్తిపంటను క్వింటా రూ.12వేలతో కొనుగోలు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్ వల్ల నష్టపోయిన పత్తి రైతులను ఆదుకునేలా పంటను క్వింటా రూ.12వేలతో కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి హాల్‌లో ఏపీ రైతుసంఘం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీరైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో తోడ్పాటు అందించండి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో సహకరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంగమేశ్వర్‌రెడ్డి, పాలకొండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వారితో పాటు జిల్లా నాయకులుసుబ్రహ్మణ్యం, మల్లు రఘునాథ, సురేష్‌బాబు తదితరులు పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకుడు శామ్యుల్‌ని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కడప మారుతీనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు మంగళవారం కడపకు విచ్చేసిన ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూలనాగరాజును కడప ఆర్ఎం ఆఫీసు సముదాయంలోని ఆయన ఛాంబరులో కలిసి వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో ఆర్టీసీ కడప డిపో ఎన్ఎంయూ అధ్యక్ష కార్యదర్శులు జయరాం, సగినాల శ్రీనివాసులుపాల్గొన్నారు.

## పిల్లలు లేని వారికి ప్రభుత్వమే దత్తతకు ...

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని వారికి పిల్లలను పొందేందుకు ప్రభుత్వం దత్తత కార్యక్రమం నిర్వహిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సునీత, ప్రత్యేక దత్తత సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి కృష్ణప్రతిరూప్ తెలిపారు. వేంపల్లెలో మంగళవారం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ దత్తత మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు. 18ఏళ్లలోపు పిల్లల సంరక్షణ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు స్వర్ణలత, బాలల పరిరక్షణ విభాగ సిబ్బంది పద్మిణి తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల చదువు అభివృద్ధికి సోపానం

సీడీపీఓ, జడ్పీటీసీ



మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల చదువు అభివృద్ధికి సోపానమని ఐసీడీఎస్ సీడీపీఓ సునీత, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి తెలిపారు. వేంపల్లె పక్కీరుపల్లెలో 8వ సచివాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆడపిల్లలను రక్షించు, ఆడపిల్లలను చదివించు కార్యక్రమంలో బాలికే భవిష్యత్ అనే నినాదంతో అవగాహన సమావేశం నిర్వహించారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథలైన పిల్లల చదువు కోసం నెలకు రూ.4వేలు స్కాలర్‌షిప్ ఉంటుందన్నారు. ఎవరైనా ఆడపిల్లలు, మహిళలకు సమస్య ఉంటే 1098కి ఫోన్ చేయాలన్నారు. తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, సూపర్‌వైజరు స్వర్ణలత, ఎంఈఓ వెంకటరామిరెడ్డి,ఏపీఎం వెంకటేశ్వరరావు, వైద్యులు సుభాషిణి, నిహారిక, ఎంపీటీసీ రహమతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


## మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు చిరస్మరణీయమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.మంగళవారం అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం,రాష్ట్రసంయుక్త కార్యదర్శి పాకా సురేష్, నాయకులు,కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

## హైవేలో అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలగింపు



చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు కొత్తరోడ్డు వద్ద హైవేలో అడ్డుగా తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలను అభివృద్ధి పనుల కోసం తొలగించడం జరిగింది. కొన్నేళ్లుగా ఈ హైవేలో సర్వీసు రోడ్లు, డ్రైన్లు, బస్‌షెల్టరు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. అయితే ఈ విషయంలో హైవే అధికారులు స్పందించకపోవడంతో ఎమ్మెల్యే చైతన్యరెడ్డికి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన అధికారులతో మాట్లాడారు. ఇదే విషయాన్ని పలుమార్లు మండల సమావేశాల్లో ప్రజాప్రతినిధులు తెలుపుతూ వచ్చారు. అయితే ఎట్టకేలకు మంగళవారం బస్‌షెల్టరు ఏర్పాటుకు ,సర్వీసు రోడ్ల ఏర్పాటుకు పనులు చేపట్టాలని నిర్ణయించడంతో అడ్డుగా ఉన్న తాత్కాలిక నిర్మాణాలన్నీ తొలగించారు. ఇందులో రోడ్డు ముందుకు చొచ్చుకుని వచ్చిన షెడ్లు, టీ అంగళ్లు, ఇతరత్రా తోపుడుబండ్లులాంటివన్నీ తీసివేశారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

పెండ్లిమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా మెనూ ప్రకారం పులగం, చెట్నీ,గుడ్డు,మజ్జిగ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.విద్యార్థులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని,బాగా చదివి ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. కాగా నేడు వెల్లటూరు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన ఉంటుందని ఆయన తెలిపారు.

## 15న టెంకాయలు, తలనీలాల సేకరణకు వేలంపాట

కాశినాయన, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అవధూత కాశిరెడ్డి నాయన జ్యోతీ క్షేత్రంలో ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు టెంకాయలు, తలనీలాల సేకరణకు సంబంధించి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పాల్గొనేవారు ముందుగా రూ.లక్ష డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఆలయ నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

## శనగల పంపిణీ పూర్తి

కొండాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు సబ్సిడీ శనగల పంపిణీ పూర్తయినట్లు ఏవో ఏవీ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఇప్పటివరకు 25 శాతం సబ్సిడీతో 1215 క్వింటాళ్ల శనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా రైతులకు విత్తనాలు కావాల్సి ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఏవో తెలిపారు.

## మట్కా బీటరు అరెస్టు

మైదుకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం బద్వేల్ రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద మట్కా బీటర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. మట్కా రాస్తున్న సమాచారం రావడంతో మంగళవారం సీఐ రమణారెడ్డి దాడి చేసి మట్కా బీటర్ షేక్ షేక్షావలిని అదుపులోకి తీసుకొని రూ.6350నగదు, స్లిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



# బొల్లవరం లేఔట్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి

● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


మున్సిపల్ కమిషనర్, ఆర్వో, డీఈలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఆదాయ వనరుగా వున్న బొల్లవరం మున్సిపల్ లేఅవుట్ ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన కమిషనర్, ఆర్వో, డీఈలతో సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ లేఅవుట్‌కు సంబంధించి గతంలో వేసిన ఎస్టిమేట్‌ల గురించి ప్రశ్నించగా గతంలో రూ.30కోట్లతో ఎస్టిమేట్ వేశారని, అంత నిధులు వెచ్చించలేమనడంతో తిరిగి రీఎస్టిమేట్ వేయాల్సి వుందని కమిషనర్ అన్నారు. 60 ఏళ్లు దాటిన ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే 60 ఏళ్లు దాటినా నాలుగేళ్లుగా జీతాలు పొందిన వారి నుండి రికవరీ చేయాలన్నారు. అయితే వీరి తొలగింపుపై ఆర్‌డీకి లెటర్ పెట్టామని కమిషనర్ చెప్పగా లెటర్ చూపించాలని ఎమ్మెల్యే కోరడంతో ఉద్యోగులు ఖంగుతిన్నారు. తొలగింపుపై లెటర్ పెట్టలేదని వెల్లడించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, ఆర్వో డేవిడ్ జోసఫ్, డీఈ రాజేశ్, ఆర్ఐ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ కోసం పని చేసేవారికి గుర్తింపు**

టీడీపీ పార్టీ కోసం పనిచేసిన వారికి ఈ ప్రభుత్వంలో తగిన గుర్తింపు గౌరవం వుంటుందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని భారత్ ఫంక్షన్ హాలులో ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కమిటీల నేతల ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి హసీనా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చంద్రమోహన్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, చంద్రాయుడు, రాజుపాలెం మండల అధ్యక్షుడిగా కందుకూరు క్రిష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు బూతురు వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు బాలసుబ్బన్న, శివశంకర్‌రెడ్డి, చెమికల అనుశ్రీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ అబ్జర్వర్ ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేశ్‌నాయుడు, బచ్చలపుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులు పాటించాలి

బి.కోడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసే పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి కౌశిక అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అమ్మవారిపేట, అయ్యవారిపల్లె గ్రామాల్లో వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. అలాగే నారుమడుల్లో పాటించవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి తాహసిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పామాయిల్ సాగు లాభదాయకం

కాశినాయన, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) పామాయిల్ సాగు లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్ అన్నారు. మంగళవారం ఏఈవో రవి ఆధ్వర్యంలో కొండ్రాజుపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న పత్తి, పామాయిల్ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానాధికారి శ్రీనివాసులరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

కలసపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించే ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం సిద్దమూర్తిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సీజన్‌లో వరికి వచ్చే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలి

పోరుమామిళ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండల పరిధిలోని టేకూరుపేట, తోకలపల్లె, సూరిసిద్దుపల్లె, ఎరసాల, తిమ్మారెడ్డిపల్లె, దాసరిపల్లె, కవలకుంట్ల తదితర గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షానికి దాదాపు 1200ఎకరాలు నీట మునిగాయని, రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, ఉపాధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వారు పోరుమామిళ్ల చెరువు కింద నష్టపోయిన గ్రామాలను సందర్శించారు.

## పిల్లలను స్నేహభావంతో చూడాలి

ఖాజీపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పిల్లల పట్ల తల్లిదండ్రులు స్నేహభావంతో మెలగాలని తహసీల్దారు రమణమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుడమలదిన్నె గ్రామంలో సీడీపీవో శ్రీదేవి అధ్యక్షతన బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, భ్రూణహత్యలను నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో స్వర్ణలత, వైద్యాధికారి మాధవి, సూపర్‌వైజర్ శ్రీదేవి, సర్పంచ్ శ్రీను, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కఠినంగా శిక్షించాలి

బద్వేలు, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో బాంబు పేలుళ్ల ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, పట్టణ ఆవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ సత్తార్, అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ పేలుళ్లలో మృతి చెందిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, అలాగే ధ్వంసమైన వ్యాపార సముదాయాలవారికి నష్టపరిహారం అందించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా ఉగ్రవాదాన్ని అంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఆవాజ్ నాయకులు పాల్గొన్నారు.

## భగవద్గీత చదవండి


ఎద్దుల బండి రథంలో భగవద్గీత ప్రచారం

జమ్మలమడుగు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ప్రతి ఒక్కరు భగవద్గీతను చదివి అందులో ఉన్న ముఖ్యమైన సారాంశం తెలుసుకుని ఆ బాటలో నడవాలని పెద్దలు కోరారు. మంగళవారం ఉదయం నుంచి ఇస్కాన్ ఆధ్వర్యంలో ఎద్దుల బండి రథంలో భగవద్గీత ప్రచారం చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద నుంచి పాత బస్టాండు, ముద్దనూరు రోడ్డు తదితర పుర వీధుల్లో భగవద్గీత ప్రచారం చేస్తూ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరుకు చెందిన ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలి

● ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్


సీఎం చంద్రబాబునాయుడును కలిసిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గతంలో సీఎం మైదుకూరు పర్యటనలో ఇచ్చిన హామీలకు నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. మంగళవారం ఆయన అమరావతిలోని సెక్రటేరియట్‌లో సీఎం చంద్రబాబునాయుడును కలిసి మైదుకూరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యల గురించి చర్చించారు. నవోదయ పాఠశాలకు, వనిపెంట బీసీ బాలికల జూనియర్ కళాశాలకు వెంటనే అనుమతులను ఇచ్చి వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వాలని, మైదుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలు మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉన్నాయని, ఈ ఐదు మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి తీసుకురావాలని, అలగనూరు బ్యాలెన్సింగ్ పనులను త్వరితగతిన చేపడితే రైతులు ఏడాదిలో రెండు కార్ల పంటలను పండించుకుంటారని కోరారు. అంతేకాకుండా బ్రహ్మంగారిమఠంలో బోగస్ ఆన్‌లైన్ భూముల గురించి, అందుకు సహకరించిన అధికారుల గురించి కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. బ్రహ్మంగారిమఠంలో భూ ప్రక్రియ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వెంటనే కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని, నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని పుట్టా తెలిపారు.

## తెలుగు భాషాభివృద్ధికి మాడపాటి ఎనలేని కృషి


మాడపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష వ్యాప్తికి, సంస్కృతి పరిరక్షణకు డాక్టర్ మాడపాటి హనుమంతరావు ఎనలేని కృషి చేశారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో మాడపాటి హనుమంతరావు వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ హైదరాబాదు నిజాం పాలనలో ధైర్యంగా తెలుగుభాష పరిరక్షణకు, న్యాయవాద వృత్తితో పేదల సంక్షేమానికి మాడపాటి కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో, కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో గౌరవించిందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌బాబు, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

## వింత వ్యాధితో గొర్రెలు మృతి

బి.కోడూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లవాగుపల్లెలో పదిరోజులుగా గొర్రెలు వింత వ్యాధితో చనిపోతున్నాయి. దీంతో రైతులు జిల్లా పశు వైద్యాధికారి శ్రీనివాసులుకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఆయన జిల్లా సహాయ సంచాలకులు మాధవి, సంధ్యారాణి, బి.మఠం సహాయ సంచాలకుడు వెంకటసుబ్బయ్యతో కలిసి నల్లవాగుపల్లె గ్రామాన్ని సందర్శించి గొర్రెలను పరిశీలించారు. వ్యాధి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చనిపోయిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఈ వ్యాధి ఇంత వరకు రాలేదని, దీనికి వైద్యం కూడా లేదని, యాజమాన్య పద్ధతులు పాటించి నివారించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణకు గొర్రెల నుండి నమూనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ప్రణీత, పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అవగాహన పెంచుకోవాలి

పోరుమామిళ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యుల్ డేవిడ్‌రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల లయోలా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అమలారాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కృత్రిమ మేధ ఆవశ్యకత, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న శ్యామ్యుల్ డేవిడ్‌రాజ్

## చిన్న బీమా.. పెద్ద భరోసా

ఎర్రగుంట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చిన్న మొత్తంలో ప్రమాద బీమా చేసుకుంటే ఆపద జరిగినప్పుడు ఎస్‌బీఐ పెద్ద భరోసా కల్పిస్తుందని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కృష్ణకిశోర్ తెలిపారు. మంగళవారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో ఎస్బీఐలో రూ.500 బీమా చేసిన తిప్పలూరుకు చెందిన సుబ్బారెడ్డి ప్రమాదంలో మరణించడంతో కుటుంబసభ్యులకు రూ.10లక్షల చెక్కును బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రామారావు, ఆర్ఎం కృష్ణకిశోర్ అందజేశారు. ఎస్బీఐ ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీవో కడప చీఫ్ మేనేజర్ నూతన్‌కుమార్, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రతను బలోపేతం చేయాలి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ బాంబు పేలుడు బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

## విద్యతోనే పేదరిక నిర్మూలన

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఎస్ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోజీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ గాజుల శివజ్యోతి, రోజీ వెల్ఫేర్ సొసైటీ గౌరవాధ్యక్షుడు హుస్సేన్‌సాహెబ్, ఉపాధ్యక్షుడు పాలగిరిబాబా, చింతకుంట కుతుబుద్దీన్, జహీరుద్దీన్ పాల్గొన్నారు.

దేవగుడిలో శ్రీచరణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



## క్రీడలకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం

● శ్రీచరణిని అభినందించిన ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. దేవగుడిలోని ఎమ్మెల్యే స్వగృహంలో మంగళవారం సాయంత్రం మహిళా క్రికెటర్ శ్రీచరణి తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహిళల ప్రపంచకప్‌లో అద్భుత ఆటతీరును ప్రదర్శించిన శ్రీచరణిని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచరణి దేశానికే గర్వకారణం

ఎర్రగుంట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారతదేశానికి మొదటి మహిళా క్రికెట్ కప్‌ను అందించడంలో కీలకపాత్ర పోషించిన శ్రీచరణి దేశానికే గర్వకారణమని భారతీయస్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కృష్ణకిశోర్ అన్నారు. మంగళవారం ఆర్టీపీపీలో శ్రీచరణి నివాసానికి వెళ్లి పూలమొక్కనిచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామారావు, ఆర్‌బీవో చీఫ్ మేనేజర్ నూతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్టీపీపీలోని కేబుల్ టీవీ ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ కూడా శ్రీచరణికి పూలమొక్క ఇచ్చి అభినందనలు తెలిపారు.

## జాతీయ అథ్లెటిక్స్‌కు బద్వేలు విద్యార్థులు

బద్వేలు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి హైజంప్ పోటీల్లో షేక్ జాస్మిన్ రెండోస్థానం, 8వ తరగతి చదువుతున్న దాదపీర్ డిస్కస్ త్రోలో నాలుగో స్థానం సాధించారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్బారావు. పాఠశాల ఉపాధ్యాయులు కొండయ్య, వెంకటరమణ, నాగరాజారెడ్డి, గంటా భారతి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు...

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడలు ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి తెలిపారు. ఈనెల 8వ తేదీ కడపలో జరిగిన ఖోఖో అండర్-14 విభాగంలో గంగా లావణ్య, చిన్ని, అండర్-17 విభాగంలో రాధా, రెహ్నాబీ, ప్రసన్న ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కోడూరులో జరిగిన అండర్-14 కబడ్డీ పోటీల్లో సాయికీర్తన, ప్రణీత, రాయచోటిలో జరిగిన అండర్-17 కబడ్డీ పోటీల్లో అశ్విత, అక్షయ, కడపలో జరిగిన అండర్-19 బ్యాడ్మింటన్ పోటీల్లో సాయికీర్తన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## మార్షల్ ఆర్ట్సులో ధర్మతేజకు పతకం


ధర్మతేజను అభినందిస్తున్న హెడ్మాస్టర్ నరసింహశాస్త్రి

చాపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో ఈనెల 11న జరిగిన రాష్ట్రస్థాయి పురుషుల మార్షల్ ఆర్ట్స్ 40 కేజీల విభాగంలో నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ధర్మతేజ్ బ్రాంజ్ పతకం సాధించినట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ నరసింహశాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెడ్మాస్టర్, ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంతి హర్షం అభినందించారు.

## 'ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు'

మైలవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని మరింత ప్రోత్సహిస్తే ఏదైనా సాధించగలరని జమ్మలమడుగు ఐసీడీఎస్ సీడీపీవో జయమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో బేటీ బచావో-బేటీ పడావో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగ అధికారి మహేశ్ మాట్లాడుతూ పిల్లలు, తల్లిదండ్రులు కూడా పిల్లల చట్టాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌసియా, సైరాభాను, సచివాలయ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర విచారణ చేయాలి

జమ్మలమడుగు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో జల్‌జీవన్ మిషన్ పథకంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జమ్మలమడుగు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సురేంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. జల్‌జీవన్ పథకంలో అనేక గ్రామాల్లో కుళాయి కనెక్షన్ ఇచ్చామని అధికారులు చెప్పుకుంటూ బిల్లులు చేసుకున్నారని, వాస్తవానికి అధికారులు ఎక్కడా కనెక్షన్లు బిగించలేదని ఆరోపించారు.

## జిల్లాకు వెల్లువలా కంపెనీలు

బద్వేలుటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు వెల్లువలా కంపెనీలు తరలివస్తున్నాయని ఏపీఐఐసీ డైరెక్టర్ వడ్డిబోయిన ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడప కలెక్టరేట్‌లోని వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిశ్రమలు ప్రారంభించే వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, కలెక్టర్ చెరకూరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.4.322కోట్ల పెట్టుబడులతో 1179 ఎకరాల్లో ఏర్పడనున్న 7యూనిట్లకు వర్చువల్ విధానంలో శంఖుస్థాపన జరిగిందన్నారు. ఈ పార్కులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి కడపను పరిశ్రమల కేంద్రంగా మారుస్తాయన్నారు.



మాట్లాడుతున్న ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి